
# బంగారు కొండ!

రచన : శ్రీ బచ్చు వీరరాజు



(రచయిత)

ఉదయం తొమ్మిది గంటలైంది. ఆ రోజు ఆఫీస్‌కి సెలవు కావడంతో తీరుబడిగా సోఫాలో కూర్చుని, పేపర్ తిరగేస్తున్నాను.

ఇంతలో ఒక్కసారిగా శ్రీమతి గావుకేక వినిపించి, అదిరిపడ్డాను.

"ఏవండోయ్! మిమ్మల్నే...తొందరగా రండీ! "నా బంగారు కొండ" అమ్మో! శ్రీమతి సరిగమ నొక్కులు తీవ్రస్థాయి నందుకుంటుంటే గబగబా, హాలులోకి పరుగెత్తాను.

'ఏవండీ! చూశారా? మన 'బంగారుకొండ' పొట్ట ఎలా ఉబ్బిపోయిందో!' శ్రీమతి కంగారుగా అంటోంది.

ఓసారి, చాపమీద పడుకొనివున్న మా ముద్దులబాబు పొట్టవంక చూశాను.

'అవును. బీరకాయలా వుండే కడుపు, ఆనపకాయలా అయిపోయింది' నీర్సంగా అన్నాను.

'ఏవండీ! ఏం మ్రింగాడో ఏమో? నాకు చాలా భయంగా వుందండీ!'

'ప్రొద్దుటినుంచీ వెదుకుతున్నాను. నా ఎయిర్‌బ్యాగ్ కనబడటంలేదు. వెధవ ఏమైనా...'

'ఛీ! వూరుకోండి. మీ బ్యాగ్ ఎంతసైజు వున్నదీ? వాడి నోరు ఎంతసైజు వున్నదీ? తెలుస్తోందా మీకు!'

'అయితే, ఆ బీరువా మూల ఊసలకట్టా, వంటింట్లో వున్న బెల్లంరాయి, ఓసారి "వున్నాయో లేదో చూడు' వాడి పొట్టవంక చూస్తూ అన్నాను.

'మీ కంటికి వాడు ఎలా కనబడుతున్నాడు?' శ్రీమతి గట్టిగా హూంకరించింది.

'అయితే పాలడబ్బా ఏమైనా మ్రింగేశాడంటావా?' నసుగుతూ అన్నాను.

'నా బొంద మ్రింగాడు!'

'ఆగు! వీడు రోజుకి ఎన్ని పాలపీకలు, కొరికి పారేస్తున్నాడు.'

'నాలుగు! ఏం?'

'అవునా? అందుకే మొన్న ఓ గ్రోసు పాలపీకలు పార్శిల్ చేయించి యింట్లో తగలేశాను గుర్తుందా?'

'ఊ! గుర్తుంది. యిప్పుడేమయింది?'


'సోఫా క్రింద పెట్టిన, ఆ ప్యాకెట్ వుందో లేదో ఓసారి చూసి అఘోరించు!'

"అంటే...అవన్నీ వాడు ప్రాకుతూ పోయి, హోల్‌సేల్‌గా మింగేశాడంటారా?" శ్రీమతి కోపంగా గద్దించింది.

'ఏం? కావచ్చు! వెధవకి ఆకలేసి, నువ్వు పనిలో వున్నప్పుడు అవన్నీ మంగళం పాడేసి వుండవచ్చు గదా?'

'చాల్లే వూరుకోండి. మీరు మీ వితండవాదం మానేసి బాబు సంగతి చూస్తారా లేదా?' శ్రీమతి సీరియస్‌గా అంది.

With best compliments from :
**UNIVERSAL LAUNDROMAT**



**Reversible cloth, Washing Machine-fully stainless steel.**
Approved by Quality Control Centre
Phone : 26035
Mfrs. :
**EMPIRE INDUSTRIES**
No. 5, Corporation Shopping Complex
JAIL ROAD, COIMBATORE-641 018.

'వెధవ! ఏం మింగి అఘోరించాడో! నడు. నా ఫ్రెండ్ శేఖర్‌గాడి హాస్పిటల్‌కి తీసుకుపోదాం!' శాంతంగా అన్నాను.

శ్రీమతి నెమ్మదిగా బాబుని లేవనెత్తి, నా కందించింది.

'అబ్బ! ఎవరెస్ట్ పర్వతాన్ని ఎత్తుకొన్నట్లుంది.' గొణుక్కుంటూ అన్నాను.

'చాల్లే వూరుకోండి! దిష్టి తగులుతుంది. మీ మాటలూ, మీరూ చాలా బాగున్నాయి. ఇక నడవండి' విసుక్కుంటూ అంది శ్రీమతి.

నెమ్మదిగా తలుపు తాళంవేసి బయటపడ్డాం.

సమయానికి డాక్టర్ శేఖర్ హాస్పిటలోనే వున్నందుకు చాలా సంతోషిస్తూ గబగబా మా బాబుని చూపించాం.

వెంటనే వాడు, మా బాబు పొట్ట పరీక్షచేసి "అనవసరంగా కంగారు పడకండి. ఏమీ కాదుగాని, యింటికి వెళ్ళి కొస్త ఆముదం పట్టించండి. నయమైపోతుంది" అని చెప్పి పంపేశాడు.

నేను వాడికి 'థాంక్స్' చెప్పి బాబును ఎత్తుకొని బయటకు నడిచాను. శ్రీమతి నెమ్మదిగా నన్ను అనుసరించింది.

X X X

ఇంటికి తిరిగివచ్చి, బాబును మంచంమీద పడుకోపెట్టాను.

"ఏవండీ! మీరు వెంటనే బజారుకెళ్ళి ఆముదం పట్టుకు రావాలి" శ్రీమతి హుక్కుం జారీచేసింది.

"ఎంత? ఓ బిందెడు పట్టుకురానా?"

"ఏమిటి? పది నెలలు కూడా లేని పసికందుకి బిందెడు ఆముదం పట్టించమంటారా?"

"అవును! వెధవ ఏం మింగి చచ్చాడోగాని నాకు ఓ కొండను మోసుకొచ్చినట్లయింది."

"చాల్లే వూరుకోండి! వెళ్ళి వెంటనే ఓచిన్న సీసా ఒకటి కొనుక్కురండి సరిపోతుంది" విసుక్కుంటూ లోపలికెళ్ళిపోయింది శ్రీమతి.

యిక తప్పదురా బాబూ! అనుకొంటూ బజారులోకి వచ్చి పడ్డాను.

X X X

నేను బజారునుంచి, ఆముదం సీసాతో తిరిగి రాగానే శ్రీమతి ఎదురై నా చేతిలోని సీసా లాక్కొని వంటింట్లోకి పరుగెత్తింది.

కొంతసేపటికి, చిన్న గిన్నెలో పోసి, ఆముదం వెచ్చచేసి బాబుకి పట్టించింది.

నేను ఈజీచైర్ తీసుకొని, వీధి వసారాలోకి వెళ్ళి కూర్చున్నాను. ఉబుసుపోవడంలేదు. నెమ్మదిగా కిటికీలో వున్న ఓ మ్యాగజైన్ అందుకొని చదువుతూ కాలక్షేపం చేస్తున్నాను.

రెండు గంటలు గడిచాయి.

శ్రీమతి బాబు దగ్గరే కూర్చుంది. బయటకు రాలేదు. బాబు అంటే శ్రీమతికి వల్లమాలిన ప్రేమ! ఆమెను ఆట పట్టించడమంటే నాకు బలేసరదా!

యింతలో గదిలోంచి శ్రీమతి కంఠం ఖంగుమంది.

'ఏమండోయ్! అర్ధరూపాయి...రూపాయి...రెండు...మూడు...ఐదు రూపాయలు...ఎనిమిది...పన్నాలుగు...పదహారు...యిరవై' శ్రీమతి ఉత్సాహంగా రన్నింగ్ కామెంటరీ చదువుకు పోతోంది.

నేను కంగారుగా గదిలోకి నడిచి, ఓసారి ఎదుటి దృశ్యం చూసి, బొమ్మలా నిలబడిపోయాను.

బాబు పడుకున్న దుప్పటి నిండా చిల్లర పేరుకుపోతోంది. పావలాబిళ్ళలు వరుసగా వాడి పొట్టనుంచి క్రిందకు నెట్టివేయబడుతున్నాయి. నాకు ఒక్కసారిగా మతిపోయింది. అవన్నీ పావలాకాసులే కావడం ఆశ్చర్యం!

శ్రీమతి తిరిగి ఉత్సాహంగా కళ్ళు చారెడంత చేసుకొని చెప్పుకుపోతోంది.

'ఇరవై రెండున్నర... యిరవై మూడు.....యిరవై మూడుంపావులా ... యిరవై నాలుగు.....యిరవై నాలుగున్నర...యిరవై నాలుగూముప్పావలా ఏమండోయ్...ముత్తం...' శ్రీమతి ఆగింది.


'యిరవై నాలుగు రూపాయల ముప్పావలా! పాతిక రూపాయలకు సరిగ్గా పావులా తగ్గింది' ఆశ్చర్యపోతూ అన్నాను.

'చూశారా...చూశారా! ఏమండీ నా బంగారుకొండ పొట్ట మామూలైపోయింది.'

'అవునూ! వెధవ యింకో పావలా మింగివుంటే పాతిక రూపాయలయ్యేది గదా?'

'ఛీ! వూరుకోండి. అవునూ యింత చిల్లర వీడెక్కడ

"కథాంజలి" జన్మదిన సంచికకు మా హృదయపూర్వకమైన శుభాకాంక్షలు !



మింగి వుంటాడు చెప్మా!' శ్రీమతి బుగ్గల నొక్కుతూ ప్రశ్నించింది.

నాకు చటుక్కున గుర్తుకొచ్చింది. వెంటనే శ్రీమతిని సమీపించాను.

'ఏమేవ్! నా కిప్పుడే గుర్తుకొచ్చింది. వీడిని ప్రొద్దున్నే బుజాన వేసుకొని పాలప్యాకెట్‌కి వీధిలోకి వెళ్ళాను గుర్తుందా?'

"అవును వెళ్ళారు."

"పాలప్యాకెట్ తీసుకొని వస్తూ, ఓసారి నా ఫ్రెండ్ కండక్టర్ రఘుని పలకరిద్దామని వాడింటికి వెళ్ళాను. ఆ టైంలోవాడు చిల్లర ముందేసుకుని లెక్కపెట్టుకొంటుంటే మనవాడిని అక్కడ వదిలిపెట్టి మేము యిద్దరం బాతాఖానీలో పడ్డాం. ఈ లోపులో..." శ్రీమతి వంక చూస్తూ ఓసారి ఆగాను.

'అర్థమైంది లెండి! ఈ లోపులో వాడికి ఆకలేసి అందిన చిల్లర నంతటినీ కైంకర్యం చేసేసి వుంటాడు' నవ్వుతూ అంది శ్రీమతి.

'అది సరే! యీ నెల మన కరెంటు బిల్లు ఎంత? సడన్‌గా ప్రశ్నించాను.

'అదీ...అదీ...అవునండీ! కరెక్టుగా యిరవై నాలుగు రూపాయల ముప్పావలా ఏం?'

'వెధవ! ఆ కరెంటు బిల్లు వీడేమైనా చూశాడంటావా?'

"చా! అవేం మాటలండీ? పదినెలలు కూడా నిండని పసికందుకు అవన్నీ ఏం తెలుస్తాయండీ?'

'అయితే వెధవ కరెక్టుగా ఆ బిల్లుకు సరిపోయే చిల్లర ఎందుకు మింగినట్లు?'

'యిది మరీ బాగుంది. ఆ సంగతి నాకేం తెలుసు? నా బంగారుకొండ నడగండి' బాబును ముద్దులాడుతూ అంది.

'ఇదిగో! వెధవని ప్రతినెలా, నీ చేతికి కరెంటు బిల్లు అందగానే వీడిని నాకు తగలెయ్యి. వెధవని అలా ఆ రఘు గాడింటికి తీసుకుపోయి, తీసుకొస్తా' నవ్వుతూ అన్నాను.

'ఊ! సరెండి. గండం గడిచినందుకు సంతోషించక మళ్ళీ అదొకటా?' అంది శ్రీమతి నా బుగ్గ మెలిపెడుతూ.

నేను నవ్వుకొంటూ, ఈ సంగతి మా డాక్టర్ శేఖర్‌కి చెప్పటానికి బయటకు దారితీశాను. *

# అంకితం

★

ఒకానొక శరత్ చంద్రిక
వికసిత నవమల్లిక
సుతారంగా వెలసింది
సురుచిరంగా నిలిచింది.

చలువలు విరిసి
చెలిమిని పొంగించింది
సుగంధాలు కురిసి
స్వప్నాలు విరిచింది.

ఆమె
సుధలు సుహాసాలుగా
కల్హారులు నయనాలుగా
తారలు హారాలుగా
రాయంచలు చెలియలుగా

దివినుండి భువికి
దిగివచ్చిన దేవకన్య—

అందంలో, చందంలో
హావంలో, భావంలో
నవ్యతలో, నాజూకులో
లావణ్యంలో, తారుణ్యంలో

ఆమె అనన్య సామాన్య
అద్భుత అసామాన్య!

ఆమె స్వచ్ఛ శరత్ చంద్రిక!
చకచ్చకిత ఇంద్రధనుర్వల్లిక!

ఆమె కిదే స్వాగతం!
ఆమె కిదే అంకితం!!

—మాల్యశ్రీ